క్లుప్తంగా

టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా బాలిరెడ్డి



టాస్క్‌ఫోర్స్ ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎస్పీ

తిరుపతి మంగళం : ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్(ఆర్‌ఎస్‌ఏఎస్టీఎఫ్) డీఎస్పీగా జి.బాలిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్‌ను కలిశారు. టీటీడీ వీజీవోగా విధులు నిర్వహించిన బాలిరెడ్డి తిరుపతి టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా రావడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను కట్టడి చేయడానికి తమ వంతు కృషి చేస్తానని డీఎస్పీ చెప్పారు.

సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు

తిరుపతి రూరల్: సీగొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం ఆ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగంలో పలు బ్రాంచ్‌లలో కొత్తగా చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తూ సీనియర్స్ నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థుల ఆటపాటలతో ఆడిటోరియం హోరెత్తిపోయింది. పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యాసంస్థల కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, విజయరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

తిరుపతి తుడా: నగరంలో అభివృద్ధి పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పన్నుల వసూలును వేగవంతం చేయాలన్నారు. అనుమతులు లేని ప్రకటనల బోర్డులను తొలగించి జరిమానా విధించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అనధికారిక లేఅవుట్లు, బిల్డింగ్‌ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని, నగరంలో ఆక్రమణలు తొలగించి, మున్సిపల్ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డీఈలు రాజు, మహేష్, లలిత, వెంకట ప్రసాద్, మోహన్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు ఇవ్వండి

తిరుపతి అర్బన్: సివిల్ సప్లయిస్ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీలకు ఐదవ తేదీలోపు జీతాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. వారు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు.

జీతాలెప్పుడిస్తారు గోవిందా..!

- 5 నెలలుగా జీతాలు చెల్లించని టీటీడీ
- ఇబ్బందులు పడుతున్నామంటున్న అధ్యాపకులు
- దసరా పండుగకైనా జీతం పడేనా... గోవిందా...!
- పర్మనెంట్‌కు గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా పట్టించుకోని వైనం



తిరుపతి సిటీ: ప్రపంచంలోనే పేరొందిన ఆధ్యాత్మిక సంస్థ టీటీడీ. ఈ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో పలు విద్యా సంస్థలు పనిచేస్తున్నాయి. వాటిలో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించలేదు. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. అప్పు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ జూనియర్ కళాశాల, పద్మావతి జూనియర్ కళాశాల, ఎస్వీ డెఫ్ అండ్ డమ్ కళాశాలల్లో సుమారు 51 మంది తాత్కాలిక అధ్యాపకులు పనిచేస్తున్నారు. నూతన ప్రభుత్వం వారికి వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్వీ జూనియర్ కళాశాలలో 20 మంది, శ్రీ పద్మావతి జూనియర్ కళాశాలలో 29 మంది, ఎస్వీ డెఫ్ అండ్ కళాశాలలో ఇద్దరు చొప్పున తాత్కాలిక అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఉద్యోగులకు ఒక్కొక్కరికి నెలకు రూ.57 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. ఐదునెలల కాలానికి సుమారు రూ.2,85,000 వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఇలా మొత్తం 51 మంది అధ్యాపకులకు ఐదు మాసాలకు కలిపి దాదాపు రూ.కోటి 45 లక్షలపైగా టీటీడీ యాజమాన్యం విడుదల చేయాల్సి ఉంది. టీటీడీకి ప్రతిరోజూ వివిధ రూపాల్లో కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. ఈ క్రమంలో చిరుద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నైనా వేతనాలు చెల్లించకపోతారా..అని అధ్యాపకులు వేయి కళ్లతో ఎదురుచూశారు. నేటి వరకు అందిన పాపానపోలేదు. రెండు రోజులలో దసరా పండుగ వస్తున్న నేపథ్యంలో కచ్చితంగా జీతాలు చెల్లిస్తారనే ఆశతో ఉన్నారు.

మా బాధలను అర్థం చేసుకుని ఆదుకోవాలి

'గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించలేదు. కుటుంబ పోషణ భారమైంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేతనాలు చెల్లిస్తారని ఆశ పడ్డాం. ఇంతవరకు పట్టించుకోలేదు. అప్పు చేసి ఇప్పటి వరకు కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా పరిస్థితి దారుణంగా తయారైంది. గత ప్రభుత్వం తాత్కాలిక ఉద్యోగులను పర్మనెంట్ చేసేందుకు జీవో విడుదల చేసింది. ఆ ప్రక్రియను కొనసాగించేలోపు ఎన్నికలు వచ్చాయి. అన్ని కళాశాలల్లోని అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్నారు. దీని గురించి ప్రస్తుత ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోలేదు. మా బాధలను అర్థం చేసుకోవాలని వేడుకుంటున్నాం' అని ఉద్యోగులు వాపోయారు.

ఒకటో తేదీనే వేతనమన్నారు

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఒకటో తేదీనే క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. అధికారం చేపట్టి మూడు నెలలు దాటినా ఇప్పటి వరకు టీటీడీ సంస్థల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తుమ్మలగుంటలో సాంస్కృతిక వైభవం

- బ్రహ్మోత్సవాలలో ఆకట్టుకున్న కళా బృందాలు
- ప్రత్యేక ఆకర్షణగా కేరళ వాయిద్యాలు



వాహన సేవల్లో కళాబృందాల విన్యాసాలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా సాగుతున్నాయి. వాహన సేవల ముందు కళాకారులు, భజన బృందాలు చేస్తున్న విన్యాసాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా కేరళ నుంచి వచ్చిన వాయిద్యాలు ప్రత్యేకతను చాటుతున్నాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కళాకారులు ప్రదర్శించే కోలాటాలు, చెక్క భజనలు, పిల్లన గ్రోవులు, డప్పు వాయిద్యాలతో భక్తులను ఆకర్షిస్తున్నారు. మరోవైపు దేవతా మూర్తుల రూపాలతో ప్రదర్శనగా వచ్చే కళాకారులు భక్తి భావాన్ని పెంచుతున్నారు. భజన బృందాలు, కళాకారులు చేస్తున్న ప్రదర్శనలకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తుండడంతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వారిని మరింతగా ప్రోత్సహిస్తున్నారు.

తిరుమలలో హోటళ్లపై చర్యలు

తిరుమల: తిరుమలలో నిబంధనలు పాటించని హోటళ్లు, వాహనాలపై టీటీడీ ఎస్టేట్, రవాణా విభాగాల అధికారులు సోమవారం చర్యలు తీసుకున్నారు. టీటీడీ ఎస్టేట్ అధికారి తనిఖీలు నిర్వహించగా భక్తులకు అధిక ధరలకు తినుబండాలు విక్రయిస్తుండడాన్ని గుర్తించారు. అలాగే శుభ్రత లేకపోవడంతో పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, దుకాణాలను సీజ్ చేశారు. డీఎంటీ రోడ్డులో భక్తులు నడిచేందుకు కూడా వీలులేకుండా రోడ్డుపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి హెచ్చరికలు జారీ చేశారు. తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేసిన టెంపో ట్రావెలర్ నుంచి పెద్ద మొత్తం వసూలు చేసి వారిని ఆర్టీవోకు అప్పగించారు.

ఆరు వాహనాల సీజ్

తిరుపతి క్రైం: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు వెళ్లే భక్తుల నుంచి అధికంగా చార్జీలు వసూలు చేస్తున్న ఆరు జీపులను సోమవారం అలిపిరి పోలీసులు సీజ్ చేశారు. అలిపిరి సీఐ రామకిషోర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం తనిఖీలు చేపట్టామన్నారు. బాలాజీ లింక్ బస్టాండ్ వద్ద భక్తుల నుంచి అధికంగా రూ.150 వసూలు చేస్తున్న ఆరు వాహనాలను గుర్తించి సీజ్ చేశామన్నారు.

నుప కంచల చాటున స్వామివారి దర్శించుకుంటున్న భక్తులు



అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయ పరిసరాల్లో ఉన్న గ్యాలరీల్లో ఉండి స్వామి వారి వాహన సేవలను తిలికించి మురిసిపోతారు. ఈ ఏడాది టీటీడీ ఇనుప కంచెలు ఏర్పాటుచేయడంతో భక్తులు స్వామిని తనివితీరా దర్శనం చేసుకోలేకపోతున్నారు. మరోవైపు శ్రీవారి ఆలయం ముందున్న గ్యాలరీల్లోకి భక్తులను అనుమతించకపోవడంతో ఆ ప్రాంగణమంతా ఖాళీగా కనిపిస్తోంది. మరికొన్నిచోట్ల భక్తులను లోపల ఉంచి గేట్లకు తాళాలు వేస్తున్నారు. గరుడ సేవ రోజైన తమకు స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ఇనప కంచెల చాటు నుంచి భక్తుల హారతి



భక్తులను లోపల పెట్టి తాళాలు వేసిన సిబ్బంది

భూ సమస్యలకు పరిష్కారం చూపండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: భూ సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీల్లో 80 శాతం భూ సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఒక సారి అర్జీ ఇస్తే మళ్లీ అదే సమస్యపై అర్జీ ఇచ్చే పరిస్థితి లేకుండా ఆర్డీవోలు, తహసీల్దార్లు చూడాలని స్పష్టం చేశారు. ఎస్సీ కాలనీల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. జేసీ మాట్లాడుతూ కోర్టు కేసుల విషయంలో లోకాయుక్త, ఆర్‌టీఐ, డిసిప్లీనరీ కేసులు, ఆర్‌వోఆర్ తదితర అంశాలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు చెన్నయ్య, సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 43 వినతులు అందాయి. శెట్టిపల్లిలోని కొన్ని వీధుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించాలని, రోడ్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. పవర్ బోర్ మరమ్మతు చేయాలని ఉప్పరపాలెం ప్రజలు కోరారు. ఐఎస్ మహల్ వెనుక చెత్త వేస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెప్పారు. టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, డ్రెయినేజీ శుభ్రం చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, డీఈలు మహేష్, రాజు, లలిత, వెంకట ప్రసాద్, మోహన్, ఏసీపీలు రమణ, బాలాజీ, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాదవ్, రవి, మేనేజర్ హసీమ్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష అంశాలపై అవగాహన అవసరం



రాకెట్, ఉపగ్రహాల నమూనాలను తిలకిస్తున్న కలెక్టర్, అతిథులు

తిరుపతి సిటీ: విద్యార్థి దశ నుంచే అంతరిక్షానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇస్రో, షార్ ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పేస్, వాతావరణ మార్పులపై పరిశోధనలు కొనసాగాలన్నారు. ఇస్రో ప్రతినిధులు మాట్లాడుతూ సామాన్య ప్రజానికానికి అంతరిక్ష పరిజ్ఞానం అందించడమే లక్ష్యంగా స్పేస్ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్పేస్, రాకెట్, ఉపగ్రహాల నమూనా ఎగ్జిబిషన్‌ను అతిథులు సందర్శించారు. కార్యక్రమంలో షార్ జీఎం ఎస్ఎస్ఎస్ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ సునీల్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ మధురిమ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో నేటి వాహనాలు

తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారు సోమవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. రాత్రి సర్వభూపాల వాహనంపై వేణుగోపాలుడిగా దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం స్వామి వారు మోహినీ అవతారంలో భక్తులను సమ్మోహనం చేయనున్నారు. పక్కనే స్వామి దంతపు పల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరో రూపంలో అభయమిస్తాడు. ప్రపంచమంతా తన మాయావిలాసమని, తనకు భక్తులైన వారు ఆ మాయను సులభంగా దాటగలరని మోహినీ రూపంలో స్వామి ప్రకటిస్తున్నాడు. అదేవిధంగా మంగళవారం రాత్రి గరుడ వాహనంలో విహరిస్తూ భక్తుల పాపాలను పటాపంచలు చేయనున్నాడు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. దాస్య భక్తితో కొలిచే భక్తులకు తాను దాసుడినవుతానని గరుడ వాహనం ద్వారా స్వామివారు తెలియజేస్తున్నాడు. మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని పేర్కొంటున్నాడు.

అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని శిక్షించాలి



టవర్‌క్లాక్ వద్ద అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

చంద్రగిరి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం చూపుడు వేలును గుర్తు తెలియని వ్యక్తులు విరిచేశారు. ఈ మేరకు సోమవారం దళిత సంఘం నాయకులు స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం విగ్రహం వద్దకు చేరుకుని అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆధిపత్యం కోసమే యుద్ధాలు

తిరుపతి కల్చరల్: ప్రపంచ దేశాలపై ఆధిపత్యం కోసమే అగ్రరాజ్యం అమెరికా యుద్ధాలను ప్రేరేపిస్తోందని పలువురు వామపక్ష, ఇతర పార్టీల నాయకులు ఆరోపించారు. గాజాలో ఇజ్రాయేల్ దాడులు ఆపాలని కోరుతూ సోమవారం యశోదా నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సంఘీభావ సదస్సు నిర్వహించారు. శరణార్థులుగా వివిధ దేశాల్లో తలదాచుకుంటున్న వారికి పాలస్తీనియన్లు కొంత భూభాగాన్ని ఇచ్చి ఇజ్రాయేల్ దేశ ఏర్పాటుకు సహకరించారని తెలిపారు. నేడు వారిపైనే ఇజ్రాయేల్ దాడులు జరపడం శోచనీయమన్నారు. ఇప్పటికే ఇజ్రాయేల్ 42 వేల మందిని హతమార్చిందన్నారు. ప్రపంచ యుద్ధంగా మారుతున్న ఈ యుద్ధాలను ఆపుదామని పిలుపునిచ్చారు.

తక్షణం యుద్ధం ఆపాలి

పాలస్తీనాపై ఇజ్రాయేల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణం ఆపాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపునేని హరికృష్ణ డిమాండ్ చేశారు. ఇజ్రాయేల్ దురాక్రమణను ఖండిస్తూ సోమవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేత కొత్తపల్లి సుబ్రమణ్యం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణి, మహిళా సంఘం నేత శాంతి, ఐఎఫ్‌టీయూ నేతలు రుద్రగోపి, లోకేష్, పీడీఎస్‌యూ నేతలు మహేష్, ధనశేఖర్, మునికుమార్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువకిరణాలు సంఘం ఎన్నిక



పద్మావతి ఆర్యవైశ్య యువకిరణాలు సంఘం నాయకులు

చంద్రగిరి(తిరుచానూరు): శ్రీపద్మావతి ఆర్యవైశ్య యువకిరణాలు నూతన సంఘం ఎన్నికలను సోమవారం తిరుచానూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా నాళం కళ్యాణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సాయిరాం, సెక్రటరీగా భరత్, కోశాధికారిగా అనుదీప్‌లను ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు ఆర్యవైశ్య సంఘం సభ్యులు సతీష్, రవి, దిండుకుర్తి సతీష్, తారక తదితరులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరిదేవిగా గంగమ్మ



తిరుపతి కల్చరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం తాతయ్యగుంట గంగమ్మ లలితా త్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం దేవి హోమం, సహస్రనామార్చన చేశారు. రాత్రి అమ్మవారికి ఊంజల్ సేవను ఘనంగా చేపట్టారు. ఈవో ఏ.జయకుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నారాయణిగా ఎల్లమ్మ



శ్రీమూలస్థాన ఎల్లమ్మ దేవి అమ్మవారు

చంద్రగిరి: దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ నారాయణి అవతారంలో గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. వాహన సేవకు తూపల్లి సుబ్రహ్మణ్యం, వనజాక్షి, భరణి కుమార్, కాపువీధి చెంగల్రాయులు కుమారులు, తిమ్మారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

జంతువులను సంరక్షించుకుందాం

తిరుపతి మంగళం : జంతువులను సంరక్షించుకుందామని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ యశోదాబాయ్ కోరారు. తిరుపతి ఎస్వీ జూపార్క్‌లో నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ నేపథ్యంలో వారం రోజులుగా వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏపీటీడీసీ తిరుపతి రమణప్రసాద్, జూ అధికారులు సిహెచ్.నాగభూషణం, జగదీష్‌చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదరహిత సబ్‌డివిజనే ధ్యేయం

తిరుపతి రూరల్: తిరుమల, తిరుపతి, తిరుచానూరు పుణ్యక్షేత్రాలు ఉన్న విద్యుత్ ఆపరేషన్-3 సబ్ డివిజన్‌ను ప్రమాదరహిత సబ్ డివిజన్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయమని డిప్యూటీ ఇంజినీరు వల్లేరు సతీష్ తెలిపారు. సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఏఈలు, ఎల్ఐలు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌టీపీ నిబంధనల మేరకు వినియోగదారులకు సేవలు అందించాలన్నారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.